


లక్ష్యాలు పూర్తిచేయకుంటే చర్యలు

● డ్వామా పీడీ రామచంద్రరావు

సీతంపేట: ఉపాధి పనులు చేపట్టడంలో సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలు పూర్తిచేయకుంటే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవల్సి ఉంటుందని డ్వామా పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక వైకేపీ సమావేశ మందిరంలో సీతంపేట, భామిని మండలాల ఎఫ్ఏలు, సీవోలు, టీఏలు, ఈసీలు, ఏపీవోలతో ఆయన మాట్లాడుతూ... ఈ నెల20లోగా లక్ష్యాలు పూర్తి చేయా లని ఆదేశించారు. ఇప్పటికే భామిని, సీతంపేట మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమో ఇచ్చామన్నారు. 4,550 కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు.



శివపూజకు వేళాయె!

● రేపు మహా శివరాత్రి ● ముస్తాబైన శైవ క్షేత్రాలు, గుహాలయాలు ● జాతరలకు ఏర్పాట్లు ● ప్రత్యేక పూజలకు భక్తులు సన్నద్ధం



సాలూరు రూరల్/ కొమరాడ, మార్చి 6: శివపూజకు వేళయ్యింది. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు జిల్లావాసులు సన్నద్ధమవుతున్నారు. ఉపవాస దీక్ష, ప్రత్యేక పూజలు, జాగరణకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలు, ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలంకరణలో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో దేవదాయ శాఖాధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు, షామియానాలు, బారికేడ్లు తదితర వాటిని సిద్ధం చేశారు. శివరాత్రి సందర్భంగా జిల్లాలో పలుచోట్ల జాతరలు కూడా నిర్వహించనున్న నేపథ్యంలో వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

పారమ్మకొండ వద్ద..

సాలూరుకు సమీపంలో ఉన్న పారమ్మకొండ వద్ద పారమ్మతల్లి జాతరకు దేవదాయ శాఖ అధికారులు, దేవస్థానం కమిటీ, సాలూరు సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. పాచిపెంట మండలం పెద్ద చీపురు వలస వద్ద ఉన్న కొండకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి భారీగా భక్తజనం తరలిరానున్నారు. కొండపై పారమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. కొందరు మొక్కులు కూడా చెల్లించుకోనున్నారు. కొండ మార్గ మధ్యలో పాండవుల గుహ, మహాదేవి ఆలయం, సుబ్రమణ్యేశ్వర, భువనేశ్వరి, శ్రీచక్రం తదితర ఆలయాలను కూడా భక్తులు దర్శించుకోనున్నారు.


పారమ్మతల్లి

కాగా శివరాత్రి సందర్భంగా కొండపై కోటి గణపతి నామాల స్థూప స్థాపన చేయనున్నారు. మరో వైపు భక్తులకు మజ్జిగ, తాగునీరు తదితర వాటిని అందించేందుకు దాతలు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పాచిపెంట ఎస్ఐ నారాయణరావు భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం సాలూరు సీఐ బాలకృష్ణ కొండ వద్దకెళ్లి భద్రత ఏర్పాట్లను పరిశీ లించారు. పారమ్మకొండ జాతరకు శుక్రవారం తెల్లవారు జాము నుంచి సాలూరు ఆర్టీసీ డిపో నుంచి 25 బస్సులను ప్రత్యేకంగా నడపనున్నట్టు డిపో మేనేజర్ భాస్కరరెడ్డి బుధవారం తెలిపారు. ప్రయాణికుల నుంచి ఆర్డీనరి చార్చి రూ. 20 వసూలు చేయనున్నామన్నారు.

గుమ్మలకొండ వద్ద..

సాలూరు మండలం కాకుడువలస వద్ద ఉన్న గుమ్మలకొండ గుహాలయానికి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. శివ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ మేరకు శివరాత్రి పర్వదినాన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహణ కమిటీ తగు ఏర్పాట్లు చేస్తోంది. కొండపైకి పూర్తిగా మెట్ల నిర్మాణం చేశారు. లైటింగ్, తాగునీరు, పులిహోర వితరణ తదితర ఏర్పాట్లు చేశారు. సాలూరు, మామిడిపల్లి, మరిపిల్లికి చెందిన యువత ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కొండ వద్ద రాత్రి భక్తుల జాగరణకు వీలుగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.


గుమ్మలకొండ గుహలో శివలింగం

మంచాడవలస గుహాలయంలో...

పాచిపెంట మండలం మంచాడవలస గుహాలయంలో స్వయంభూగా వెలసిన గోకర్ణేశ్వరస్వామి జాతరకు కూడా నిర్వహణ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. గుహాలయానికి చేరుకునే మెట్లు, శివ, నంది, ఆంజనేయస్వామి విగ్రహాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జాతరకు వచ్చే వారికి తాగునీరు, ప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ గుహాలయంలో శివుడు మహిమాన్వితుడుగా భక్తుల విశ్వాసం. అందుకే శివరాత్రికి పెద్దసంఖ్యలో భక్తజనం ఇక్కడకు తరలి వస్తారు. ఇరుకైన గుహ గుండా లోనికి వెళ్లి శివదర్శనం చేసుకుంటారు. అనంతరం ఈ కొండ వద్దే జాగరణ చేస్తారు. ఇదే మండలంలో గురువునాయుడుపేట నందీశ్వర కొండపై జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు.


మంచాడవలస గోకర్ణేశ్వర స్వామి గుహాలయం



గుంపలో..



ద్వాపరయుగంలో బలరాముడు ప్రతిష్ఠించిన పంచ లింగాల్లో కొమరాడ మండలం గుంప సోమేశ్వర ఆలయం ఒకటని చరిత్ర చెబుతుంది. జంఝావతి, నాగావళి నదుల సంగమంలో ఈ ఆలయం వెలసింది. ఏటా మహాశివరాత్రి రోజున ఇక్కడ జాతర నిర్వహించ డం ఆనవాయితీగా వస్తుంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా ఇక్కడకు భక్తులు భారీగా తరలి రానున్నారు. రాత్రి వేళ ఆలయం వద్ద జాగారం చేయనున్నారు. కాగా భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్లు, లైటింగ్, తదితర ఏర్పాట్లను దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి గుంపకు ఏడు బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నట్టు డిపో మేనేజర్ దుర్గ తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.


మృతి చెందిన చేపలను టీడీపీ నేతలకు చూపిస్తున్న మత్స్యకారులు

గోపసాగరంలో చేపలు మృతి

● రూ.1.50 లక్షలు నష్టం

● డంపింగ్‌యార్డే కారణమంటున్న మత్స్యకారులు

పార్వతీపురం టౌన్, మార్చి 6 : పట్టణ శివారు డంపింగ్ యార్డుకు అనుకుని ఉన్న గోపసాగరం చెరువులో చేపలు మృతి చెందుతున్నాయి. దీంతో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. గత వారం రోజులుగా సుమారు టన్ను వరకు చేపలు మృతి చెందాయని, రూ.1.50 లక్షల మేర నష్టపోయామని వారు భోరున విలపించారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న పార్వతీపురం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మత్స్యకారులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. తనవంతుగా వారికి రూ.6 వేలు ఆర్థిక సాయం చేశారు. డంపింగ్ యార్డులోని విష పదార్థాల వల్ల గోపసాగరం చెరువులోని చేపలు మృతి చెందాయని, రూ.1.50 లక్షలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సర్కారు, అధికారులు స్పందించే వరకు మత్స్యకార కుటుంబాల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డు తరలించాలని మత్స్య, రజక, రైతు సంఘాలు కోరుతున్నా ఎమ్మెల్యే జోగారావు, మున్సిపల్, రెవెన్యూ అధికారులను స్పందించక పోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో గోపసాగరంపై ఆధారపడి జీవిస్తున్న వారు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు.

హడలెత్తిస్తున్నాయ్..



కొమరాడ/భామిని, మార్చి 6 : కొమరాడ, భామిని మండల వాసు లను గజరాజులు హడలెత్తిస్తున్నాయి. ప్రధానంగా కొమరాడ మండలంలో మాదలంగి, వన్నాం, దళాయిపేట గ్రామాల్లో మొక్కజొన్న, అరటి, కూరగాయ పంటలను ఏడు ఏనుగులు నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇక భామిని మండలం తాలాడ, ఘనసరలో గత వారం రోజులుగా నాలుగు ఏనుగులు సంచరిస్తున్నాయి. బుధవారం ఘనసర-తాలాడ రహదారిలో అవి ప్రత్యక్షం కావడంతో రైతులు బెంబేలెత్తిపోయారు. ఆ ప్రాంతంలో మొక్కజొన్న పంట ఉండడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఘనసర, కీసర, కోసలి, తాలాడ గ్రామస్థులైతే సాయంత్రం వేళల్లో ఇళ్ల వద్ద నుంచి బయటకు రాలేకపోతున్నారు. తక్షణమే ఏనుగులను తరలించాలని వారు డిమాండ్ చేశారు.

80 ఏళ్లు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు

● ఎన్నికల విధులకు వలంటీర్లు దూరం ● రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి

సీతంపేట: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 80 సంవత్సరాలు దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని పాలకొండ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణ, విధి విధానాలపై బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం ఉండాలని, దీనిలో భాగంగా వాస్తవ వార్తలను మాత్రమే ప్రచురించాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన ప్రచార చిత్రాలు, కరపత్రాలు ముద్రిస్తే అభ్యర్థి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. పాలకొండ నియోజకవర్గంలోని 287 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సెక్టార్ అధికారులు, పోలీసులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. మండలాల వారీగా సర్వేలైన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, పాలకొండ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు సూచించామని తెలిపారు. దీని కోసం ప్రత్యేకంగా సీఆర్‌పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ఈవీఎంల ద్వారా ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గ్రామ వలంటీర్లకు ఎటువంటి ఎన్నికల విధులు అప్పగించడం లేదని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే కమిషన్ సూచించిన అన్ని నిబంధనలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి

నామినేషన్‌కు ఐదుగురికే అనుమతి : పీవో

సాలూరు/రూరల్,మార్చి 6: ఎన్నికల సమయంలో నామినేషన్ దాఖలుకు అభ్యర్థితో సహా కేవలం ఐదుగురికే నిర్ణీత గదిలోకి అనుమతిస్తామని సాలూరు రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణు చరణ్ అన్నారు. బుధవారం సాలూరు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి గది ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఆ గదికి కేవలం తెల్లసున్నం మాత్రమే వేయాలన్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత చేయాల్సిన పనులపై అధికారులందరు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే సన్నద్ధం కావాలన్నారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు.


అధికారులతో చర్చిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో



కన్నుల పండువగా..

● కల్యాణ వేంకటేశ్వరునికి లక్ష తులసి దళార్చన

మాఘమాస బహుళ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి దళార్చన పూజను వైభవంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో శ్రీవారికి లక్ష తులసి దళాలతో పాటు వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో ప్రత్యేక నివేదిన కార్యక్రమం నిర్వహించారు. అర్చన అనంతరం మంత్ర పుష్పం పఠించారు. శ్రీవారిని, దేవేరులకు హనుమంత, గరుడ వాహనాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాజేంద్రప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

- సాలూరు రూరల్

టెన్త్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

● జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర

సీతంపేట : టెన్త్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ నున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో ఈ ఏడాది 1830 మంది గిరిజన విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్టు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే.. 200 మంది అదనంగా పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన విద్యారులకు రాత్రి సమయంలో టీ, స్నాక్స్, పాలు సరఫరా చేయాలని హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్ష కేంద్రం దూరం బట్టి వారికి వాహన సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.


మాట్లాడుతున్న డీడీ

పోలీస్ స్టేషన్లకు ప్రశ్న పత్రాలు

గరుగుబిల్లి : పదో తరగతి పరీక్షలకు సంబంధించి అవసరమైన ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్లకు చేరాయి. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా సెట్-1, సెట్-2 ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. బుధవారం గరుగుబిల్లి, సీతానగరం ఎంఈవోలు ఎస్.నాగభూషణరావు, వెంకటరమణ, సిబ్బంది గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. వాటిని పరిశీలించారు. ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్టుమెంటల్ అధికారి, 8 మంది ఇన్విజిలేటర్లు, ఇతర జిల్లాలకు చెందిన అధికారులు ప్రత్యేక స్క్వాడ్ బృందాలుగా ఉంటారని వారు తెలిపారు.

రక్తహీనతతో మరణాలు సంభవించరాదు

● వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో జగన్నాథరావు ఆదేశం

భామిని/గుమ్మలక్ష్మీపురం: రక్తహీనతతో మాతాశిశు మరణాలు సంభవించరాదని డీఎంహెచ్‌వో జగన్నాథరావు ఆదేశించారు. బుధవారం బాలేరు, బత్తిలి పీహెచ్‌సీలను సందర్శించారు. నల్లరాయిగూడలో అవగాహన సదస్సులు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులను గుర్తించాలన్నారు. సచివాలయ పరిధిలో అధికారులు, ఏఎన్ఎంలు వారిని దత్తత తీసుకోవాలని సూచించారు. వారి ఆరోగ్యం కుదుట పడే వరకు వైద్యం అందించాలని తెలిపారు. అనంతరం ఆయన బాలేరు, బత్తిలి పీహెచ్‌సీల్లో హాజరుపట్టికలు, ప్రసవాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ డీసీవో అప్పారావు, వైద్యాధికారి దీపికారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన గుమ్మలక్ష్మీపురంలో గిరిజన గర్భి ణుల వసతిగృహాన్ని సందర్శించారు. వసతులు, వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంసీపీ కార్డులో కాన్పు, గడువు తేదీలను పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రసవ తేదీకి ముందే గిరిజన గర్భిణులను సమీపంలో ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు.


గుమ్మలక్ష్మీపురంలో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో



అడుగుకో గుంత..

● అధ్వానంగా గుమ్మలక్ష్మీపురం-కురుపాం రోడ్డు

● ఐదేళ్లవుతున్నా.. మరమ్మతులకు నోచని వైనం

● వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ఇది గుమ్మలక్ష్మీపురం-కురుపాం ప్రధాన రహదారి. రాళ్లు తేలి.. భారీ గోతులతో ఇలా అధ్వానంగా మారింది. పట్టుమని కిలోమీటరు కూడా సాఫీగా ప్రయాణం చేయలేని పరిస్థితి. సుమారు 20 కిలోమీటర్ల దారిలో అడుగుకో గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. తరచూ ప్రమాదాలకు గురువుతున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం రోడ్డుపై గోతులు పూడ్చి.. మరమ్మతు పనులు కూడా చేయకపోవడంపై వాహనదారులు పెదవి విరుస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలతో పాటు ఒడిశా రాష్ట్రం గుణుపూర్ వైపు వెళ్లే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రోడ్డు పనులు చేపట్టారు. ఆ తర్వాత ఈ రహదారిని పట్టించుకునే వారు కరువయ్యారు. రోజూ వందలాది వాహనాలు ప్రయాణించే కీలక రోడ్డుపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహమూర్తిని వివరణ కోరగా.. నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

- గుమ్మలక్ష్మీపురం

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

● 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ జస్ట్ శాంపిల్ మాత్రమే ● ముందుంది అసలైన మేనిఫెస్టో ● టీడీపీ నాయకుల ప్రచారం

'వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన గెలుపును ఎవరూ ఆపలేరు. 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ జస్ట్ శాంపిల్ మాత్రమే. పూర్తిస్థాయి మేనిఫెస్టో ఇంకా ముందుంది. దీన్ని చూశాక వైసీపీ పోటీ చేయడం మానేస్తుంది. ఇక వైసీపీ పని అయిపోయినట్లే. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్‌వన్‌గా మారుస్తారు.' అని టీడీపీ నాయకులు తెలిపారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నలలితకుమారి

టీడీపీతోనే బీసీలకు న్యాయం: లలితకుమారి

శృంగవరపుకోట: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు నెలకు రూ.4వేలు పించన్ అందిస్తామని తెలిపారు. వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లల్లో రూ.లక్షన్నర కోట్లు ఖర్చుచేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 34శాతానికి పెంచుతామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు, జయహో బీసీ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, చెక్క కిరణ్ కుమార్, కాపుగంటి వాసు, అనకాపల్లి చెల్లయ్య నానిగిరి రమణాజీ, సాయిరాం తదితరులు వున్నారు.

500 కుటుంబాలు చేరిక

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో వైసీపీకి చెందిన ఎంపీటీసీ చిన్నమ్మలు, వైస్ సర్పంచ్ తమ్మిరెడ్డి వెంకటరమణ, పలువురు వార్డు మెంబర్లు ఇలా మొత్తం 500 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉద్దవోలును అభివృద్ధి పథంలో నడిపిస్తామని వారు హామీ ఇచ్చారు. బేబీనాయన, తెంటుకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్, మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం, నాయకులు యుగంధర్, అచ్యుతరావు, సింహాచలం మాష్టారు, పాల్గొన్నారు.


తెర్లాం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న బేబీనాయన

విజయబావుటా ఎగురవేస్తాం: బేబీనాయన

బొబ్బిలి: వచ్చే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేస్తామని టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో స్థానిక కోవెల సెంటరులో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ- రెండు పార్టీల శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు ఆదాడ మోహనరావు, పెద్దింటి మనోజ్‌కుమార్, రాంబార్కి శరత్‌బాబు, గెంబలి శ్రీనివాసరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, సుంకరి సాయిరమేష్, కాకల వెంకటరావు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వండి: అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు బుధవారం విజ్జీ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ సభ్యులను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, నాగరాజు, కిల్లాన మహేష్, వైద్యుడు గజపతిరాజు ఉన్నారు. ● విజయనగరం మండల పరిధిలోని బడుకొండ పేటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని అదితి గజపతిరాజు బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, పి.రాజేష్‌వర్మ, బడుకొండ రామారావు, ఎం.నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం రూరల్: వాకర్స్, క్రీడా సంఘాల ప్రతినిధులతో అదితి గజపతిరాజు

వైసీపీ పని అయిపోయింది: గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్: వైసీపీ పని అయిపోయిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. బుధవారం అలుగుబిల్లి గ్రామంలో బోరును ప్రారంభించారు. మరో 60రోజుల్లో తెలుగుదేశం పాలన రాబోతుందని తెలిపారు. 50ఏళ్లు నిండిన ప్రతి బీసీకి రూ.4వేలు పించన్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, విశాఖ టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడుబండిని ఓడిస్తాం


మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషి

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడిస్తామని ఎస్.కోట ఎంపీపీ సండి సోమేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీటీసీ వాకాడ సింహాచలం, నాయకులు బోజంకి గోవింద, మోపాడ గౌరినాయుడు, వెంకటరావులు పేర్కొన్నారు. బుధవారం ఎస్.కోటలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తీరునచ్చకే టీడీపీలో చేరామన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యే కడుబండికి డిపాజిట్ కూడా రాదన్నారు. వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

పుణ్యగిరి జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: మహాశివరాత్రి సందర్భంగా శృంగవరపుకోట పుణ్యగిరికి, సన్యాసయ్యపాలేనికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రమేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి శనివారం సాయంత్రం వరకు ఈ బస్సులు తిరుగుతాయన్నారు. పుణ్యగిరికి 15 బస్సులు, సన్యాసియ్యపాలేనికి 3 బస్సులు మొత్తం 18 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. శుక్రవారం రాత్రి మెత్తం పుణ్యగిరి కొండకు బస్సులు ఉంటాయన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి జడ్పీహైస్కూల్లో 10వతరగతి చదువుకుంటున్న విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్, ప్లాంకులు, స్కేల్స్, పెన్నులు పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ యూత్‌కు చెందిన సభ్యులు 40 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు తాము పంపిణీ చేసిన మెటీరియల్ బాగా ప్రయోజనకరంగా ఉంటుందని యూనిట్ సభ్యులు తెలిపారు.

కష్టపడి చదువుకోవాలి

కొత్తవలస: కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వియ్యంపేటలోని జీఎంసీ బాలయోగి గురుకుల బాలికల పాఠశాల, వియ్యంపేట జడ్పీ హైస్కూళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రెండు పాఠశాలల్లోని 10 తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మస్టర్లలో తేడాలు సహించేది లేదు

రేగిడి: ఉపాధి పనుల్లో వేతనదారుల మస్టర్లలో తేడాలు సహించేది లేదని, ఒకరికి బదులు ఇంకొకరిని పనికి అనుమతించకూడదని, ఉపాధి ఏపీవో హరినాథ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మండలంలో కందిశలో కరశెట్టివానిచెరువుకు జరుగుతున్న ఉపాధి పనిని ఏపీవో హరనాథ్ తనిఖీ చేశారు. పనిప్రదేశంలో 223 మంది వేతనదారుల హాజరును గమనించిన ఆయన వేతనదారుల హాజరుపై పరిశీలన చేశారు. కొలతల ప్రాప్తికి రెండు పూటలా పనిచేస్తే రూ. 272లు వేతనం గిట్టుబాటు ఉంటుందని, ఆ మేరకు పనులు చేయాలని సూచించారు. ఎఫ్ఏ యశోద, మేటీలు ఉన్నారు.

'మిచింగ్' బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ

కలెక్టరేట్: జిల్లాలోని 2023లో మిచింగ్ తుపాన్ కారణంగా 297.77 హెక్టార్ల విస్తీర్ణంలో పంటకు నష్టం జరగడంతో జిల్లాలోని 1059 మంది రైతులకు రూ. 50.62 లక్షలు పెట్టుబడి రాయితీని సీఎం జగన్ బుధవారం పెట్టుబడి రాయితీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్ష పత్రాలు డిపాజిట్

రేగిడి: ఎస్ఎస్‌సీ పరీక్ష ప్రశ్నపత్రాలు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేసినట్లు ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. మండలంలో రేగిడి, సంకిలి, లక్ష్మీపురం, అంబాడ వెంకటాపురం హైస్కూళ్లు పరీక్ష కేంద్రాలుగా ఎంపిక కాగా, వీటిలో 660 మంది పిల్లలు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో వెల్లడించారు. పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఈవో తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో మహిళా దినోత్సవం

బొబ్బిలి: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం యూటీఎఫ్ రాష్ట్ర మహిళా నేత కె.విజయగౌరి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయగౌరి మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులను మనమంతా చైతన్యంతో దక్కించుకోవాల్సిన అవసరం ఉందని, దీనికి విద్య ఒక్కటే ఆయుధమన్నారు. అనంతరం విద్యార్థులకు మహిళలకు సంబంధించిన సమాచారంతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షర్మిల సభను విజయవంతం చేయండి

రాజాం: వచ్చేవారం విశాఖపట్నంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి కోరారు. బుధవారం స్దానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించి నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల నుంచి ప్రజలు భారీగా హాజరయ్యేలా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండలాల అధ్యక్షులు కృషి చేయాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సరగడ రమేష్, రాజాం నియోజకవర్గం ఇన్‌చార్జి రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్‌చైర్మన్ కంబాల రాజవర్దన్, మండల పార్టీ అధ్యక్షులు దేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కోండ్రు

రాజాం, మార్చి 6: అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ బుధవారం శ్రీకారం చుట్టారు. ముందుగా శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న నవదుర్గ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొగిరి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బీసీ డిక్లరేషన్‌ను నాయకులు ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. బీసీ డిక్లరేషన్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కోండ్రు మీడియాతో మాట్లాడుతూ బీసీల బాంధవుడు నారా చంద్రబాబునాయుడని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలకు పెన్షన్‌ను అమలు చేసి రూ.4వేలకు పెంచుతామన్నారు. అలాగే ఆర్థిక అభివృద్ధి ఉపాధికి ప్రోత్సహకాలు పునరుద్ధరిస్తామన్నారు. ముందుగా గ్రామంలో ప్రజలు మంగళ హారతులు ఇచ్చి గ్రామంలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, పట్టణ అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు


పొగిరిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోండ్రు

● శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో ఎన్నికల ప్రచారం సన్నాహక కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం కోండ్రు మురళీ మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి


మొక్కలు నాటుతున్న డీఎస్పీ

విజయనగరం క్రైం: విద్యార్థులు సన్మార్గంలో నడవాలని, ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. బుధవారం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2, 3 సహకారంతో డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కార్యాలయ ఆవరణలోనూ, ఇంటి ఆవరణలోనూ మొక్కలు నాటాలన్నారు.

ఎన్నికల కోడ్ రాకముందే ఇళ్లు అప్పగిద్దాం

● తాళం చెవి ఇవ్వకుండానే బ్యాంకుల నుంచి నోటీసులంటూ ఫిర్యాదులు

● టిడ్కో కాలనీలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: టిడ్కో ఇళ్లకు సంబంధించిన తాళం చెవి అప్పగించకుండానే మా అందరికీ బ్యాంకు రుణాల అప్పులు తీర్చాలని నోటీసులు వస్తున్నాయని లబ్ధిదారులంతా ఫిర్యాదులు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు వ్యాఖ్యానించారు. స్థానిక టిడ్కో కాలనీలో 3.71 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. విద్యుత్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ రాకమునుపే లబ్ధిదారులకు రెండు మూడురోజుల్లోగా ఇళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఒప్పుకుంటే ఈ ఇళ్లను ఎలా ఉన్నా ఇప్పటికిప్పుడే ఇచ్చేద్దామని అన్నారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ కారణంగా ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. బొబ్బిలిలో 1270 ఇళ్లను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. టిడ్కో ఈఈ జ్యోతి, విద్యుత్ ఈఈ ఎ.అనంతరావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, కమీషనరు లాలం రామలక్ష్మి, వైస్‌చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, తెంటు పార్వతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కళాభారతి ఆడిటోరియంలో ఏసీ సదుపాయం

బొబ్బిలి: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఏసీ సదుపాయాన్ని బుధవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. కళాభారతి ఉపాధ్యక్షుడు నంబియార్ వేణుగోపాలరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత బాలకళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ప్రముఖ కళాపోషకుడు కర్రి సత్యనారాయణ ఇటీవల డాక్టరేట్‌ను అందుకోవడంతో ఆయనను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు, సంస్థ అధ్యక్షుడు సిద్దా సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు డాక్టర్ కేవీ అప్పారావు, చెలికాని చెల్లారావు, రౌతు రామ్మూర్తి, పుల్లెల శ్రీనివాసరావు, డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెట్ పరీక్షలు

కలెక్టరేట్: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష బుధవారంతో ముగిసింది. గతనెల 27 నుంచి ఇప్ప టి జరిగిన పరీక్షకు 11,580 అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 10,429 మంది హాజరయ్యారు.

హోటల్ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న స్వామి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోటళ్ల రంగాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి ఆదుకోవాలని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఒక హోట ల్‌లో హోటల్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న హోటల్ రంగం నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, ప్రభు త్వాలు హోటల్స్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించి రాయితీలు, సౌకర్యాలు కల్పించా లన్నారు. రాత్రి పూట ప్రయాణం చేసే ప్రయాణికుల సౌకర్యార్థం హోటల్స్‌ని అర్ధ రాత్రి వరకూ తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. హోటల్ రూంలకు జీఎస్టీ తగ్గించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ శెనాయ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి గుడిశ శివకుమార్, పూర్ణచంద్, హోటల్ యాజమానులు పాల్గొన్నారు.

శ్రీశైలం తలపాగా ఊరేగింపు


తలపాగాను ఊరేగిస్తున్న దృశ్యం

రాజాం: రాజాం పట్టణ వాసీ చల్ల జయరాం దంపతులు శ్రీశైలం మల్లన్న తలపాగాను గత కొంతకాలంగా తయారు చేశారు. శివరాత్రి సందర్భంగా తలపాగాను మల్లనకు అందించడానికి బుధవారం పట్టణంలో ఊరేగించి ప్రత్యేక వాహ నంలో బయలుదేరి వెళ్లారు. అక్కడ కనకదుర్గ అమ్మవారికి చూపించి అమ్మవారిని దర్శించుకొని అక్కడ నుంచి శ్రీశైలం బయలుదేరి వెళ్తామని జయరాం దంపతులు తెలిపారు.

సంకిలిలో సంగిడీ పోటీలు


విజేతలకు ప్రైజ్‌మనీ అందిస్తున్న నిర్వాహకులు

రేగిడి, మార్చి 6: మండలంలో సంకిలికి చెందిన వారడ పట్టాభినాయుడు స్మారకార్థం బుధవారం జిల్లాస్థాయి సంగిడీ (వస్తాదు) పోటీలు నిర్వహించా రు. ఈ పోటీలు నిర్వాహకులు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పలు విభాగాల్లో నిర్వహించి న పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 20 మంది వరకూ వస్తాదులు పాల్గొని తమ సత్తా నిరూపించుకున్నారు. ● 180 కేజీల సింగిడీ రాయి విభాగంలో పొలాకి మండలం చింతువానిపేటకు చెందిన అవాల వసంతరావు ప్రథమస్థానంలో నిలిచాడు. 160 కేజీల విభా గంలో శ్రీకాకుళం మండలం ఒప్పంగికి చెందిన గేదల సత్యనారాయణ ప్రథమ స్థానం, ఒంటిచేతితీతలో పొందూరు మండలం రాపాకకు చెందిన రజాక్ ప్రథమ స్థానం సాధించాడు. వీరికి దివంగత పట్టాభినాయుడు తనయుడు గౌతమ్ ట్రాన్స్‌పోర్టు నిర్వహకుడు వారడ శ్రీనివాసరావు తదితరులు బహుమతులు అందించారు. ఈపోటీలు తిలికించేందుకు పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

పంచాయతీ తీర్మానంతోనే ఆశావర్కర్ నియామకం

● టీడీపీ నాయకుల డిమాండ్

● ఆరికతోట పీహెచ్‌సీ ఎదుట ఆందోళన


ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

రామభద్రపురం, మార్చి 6: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశావర్కర్ పోస్టును గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకే భర్తీ చేయాలని తెలుగుదేశం నాయకుడు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆరికతోట పీహెచ్‌సీ వద్ద కొంతమంది గ్రామస్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశావర్కర్ మృతిచెందడంతో అప్పటి నుంచి ఈ పోస్టును భర్తీ చేయకుండా కాలయాపన చేయడమే కాకుండా పంచాయతీ తీర్మాణం, నోటిఫికేషన్ ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన కొంతమంది కుట్రలు చేస్తున్నారని, అధికారులు మాత్రం నిబంధనల మేరకే ఆశావర్కర్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై వైద్యాధికారి మాట్లాడుతూ ఈ వినతిపత్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో ఆఫీసుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరిపి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కోట ఆదినారాయణ, మరికొంత మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు శక్తివంతమవ్వాలి

● మహిళా దినోత్సవ వేడుకల్లో ఆర్డీవో సాయి శ్రీ

బొబ్బిలి, మార్చి 6: నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో కీలక భూమిక పోషిస్తున్నారని, మనమంతా ఎంతో శక్తిమంతులమైతే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయి శ్రీ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మహిళా అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇంతులకు ఇష్టమైన రంగంలో రాణించేందుకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించాలన్నారు. బాల్యదశ నుంచి కౌమార దశ వరకు ఆడపిల్లలకు సరైన మార్గదర్శకత్వం ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ పూర్వకా లంలో మహిళలను వంటిల్లు కుందేలుగానే పరిమితం చేసేవారని, ఇప్పుడు బాలికలకు ఇష్టమైన అంశాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్‌ల వల్ల స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కాగలిగామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన వారికి ఆర్డీవో చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవి కుమార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా అధికారులు

కొట్టి చంపి.. రోడ్డు ప్రమాదమని చెప్పి

● గృహిణి మృతి కేసులో వెలుగు చూసిన దారుణం

● భార్యపై అనుమానంతో భర్త ఘాతుకం


మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ చదలవాడ

బొబ్బిలి, మార్చి 6: భార్యను చంపి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మలిరెడ్డి నాగేశ్వర రావు ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. బొబ్బిలి మండలం కమ్మవలస గ్రామానికి చెందిన పాతినవలస తవిటినాయుడు, భార్య లక్ష్మి తరచూ గొడవలు పడుతుండేవారు. గ్రామపెద్దల సమక్షంలో వారి తగాదాలను తాత్కాలికంగా పరిష్కరించేవారు. వారికి 9, 11 ఏళ్ల ఇద్దరు కుమారులున్నారు. ఈ క్రమంలో గత నెల 17న బొబ్బిలిలో సెంట్రింగ్ పని నిమిత్తం కమ్మవలస నుంచి వచ్చిన తవిటినాయుడు కొద్ది సేపటికే మళ్లీ కమ్మవలసలోని తన ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో తన ఇంటికి చెందిన అన్ని తలుపులు, కిటికీలు మూసి ఉండడంతో అనుమానంతో భార్యతో గొడవపడ్డాడు. గత నెల 20న పొరుగున కొండదేవుపల్లి గ్రామంలో భీష్మఏకాదశి పూజల కోసం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి సొంతూరుకు వచ్చేశారు. అదే రోజు రాత్రి భార్యను మూడు రోజుల క్రితం జరిగిన ఘటనపై నిలదీయడంతో వారిద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో తవిటినాయుడు భార్య లక్ష్మిని రాడ్‌తో తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. వెంటనే తన తమ్ముడుకి విషయం చెప్పడంతో వారంతా తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఆటోలో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలకు కారణం ఏమిటని డాక్టర్ అడగడంతో రోడ్డు ప్రమాదం జరిగిందని గాయపడ్డ లక్ష్మి చెప్పడంతో ఆయన ప్రాథమిక చికిత్స చేసి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మెలకువలోకి వచ్చిన లక్ష్మి జరిగిన ఘటన చెప్పకుండా దాచిపెట్టింది. ఈ లోగా ఆమె తల్లి గొట్ల నారాయణమ్మ, సోదరుడు భాస్కరరావు ఆసుపత్రికి చేరుకుని ఆరా తీయడంతో ఆమె జరిగిన విషయాలన్నిటినీ చెప్పింది. వృద్ధురాలు, పేదరాలైన తల్లి నిస్సహాయురాలై, ఈ విషయాలను ఎవ్వరికీ చెప్పకుండా పిల్లల కోసం గోప్యంగా ఉంచింది. లక్ష్మికి సర్జరీ చేసిన తరువాత గత నెల 23న ఆమె ఆసుపత్రిలో కన్నుమూసింది. ఆ వెంటనే భర్త భయంతో అక్కడ నుంచి పరారయ్యాడు. గత నెల 24న శవపంచనామా జరిపి పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్థులు, బంధువుల నుంచి విషయాన్ని ఆరా తీశారు. అప్పటి నుంచి అతని కోసం పోలీసులు గాలింపు ప్రారంభించారు. గ్రామ వీఆర్వో వాడాడ ప్రమీల సమక్షంలో బుధవారం తవిటినాయుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీనిపై నిందితుడిని బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ కేసులో ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ పూర్తి స్థాయి విచారణ చేసినట్టు ఆయన తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని లచ్చరాయపురం సెంటర్‌లో బుధవారం నాయిరాలవలసకు చెందిన బెజ్జిపురపు శ్రీకాంత్ 52 మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు రాజాం ఎస్ఈబీ సీఐ శ్రీధర్ తెలిపారు. మద్యాన్ని సీజ్‌చేసి నిందుతుడిని అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఎక్కడ ఈ తరహా అక్రమ చర్యలు ఉన్నా ఉపక్షించేది లేదని సీఐ వెల్లడించారు. ఈ తనిఖీలో ఎస్ఈబీ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు. ● మండలంలో ఉంగరాడమెట్ట సెంటర్‌లో లచ్చన్నవలస గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. నిందితుడు అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. తనిఖీలో సిబ్బంది శివ, బుల్లిబాబు ఉన్నారు.

పట్టుబడ్డ మద్యం సీసాలు ధ్వంసం

విజయనగరం క్రైం: విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ 272 మద్యం సీసాలను బుధవారం సెబ్ డీఎస్పీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. విజయనగరం రూరల్ పరిధిలో 2023-24 సంవత్సరంలో వివిధ ప్రదేశాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను రూరల్ ఎస్ఐ వాసుదేవ్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీటిని బుధవారం మధ్యవర్తుల సమక్షంలో సెబ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

విజయనగరం క్రైం: వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇస్తే, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ రంగనాథం హెచ్చరించారు. మంగళవారం రాత్రి కోట జంక్షన్‌లో వాహనాలు నడుపుతూ, పట్టుబడ్డ మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో ప్రమాదాలు అధికమౌతున్నాయన్నారు. నగరంలో రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, తనిఖీల్లో పట్టుబడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐలు లోవరాజు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని పట్టణాల్లో రైతు బజార్ల ఏర్పాటుకు చర్యలు

బొబ్బిలి, మార్చి 6: అన్ని ప్రధాన పట్టణాల్లో రైతుబజార్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ తెలిపారు. స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ(ఏఎంసీ) ఆధ్వర్యంలో బుధవారం నుంచి నూతనంగా వారపుసంతను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ సుధాకర్ మాట్లాడుతూ తమ పరిధిలో 61 ఏఎంసీలు ఉన్నాయని, వాటి ద్వారా 163 కోట్ల రూపాయల మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యమన్నారు. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో ఏఎంసీలు నిత్యం రైతులు, వ్యాపారులతో కళకళలాడుతాయన్నారు. మన ప్రాంతంలో మాత్రం ఏఎంసీలు అధ్వానంగా ఉంటాయన్నారు. బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామన్నారు. ఏఎంసీలలో బయట వ్యక్తులు వ్యాపారాలు కొనసాగించుకునేందుకు నామమాత్రపు ఫీజుతో అనుమతి ఇస్తామన్నారు. రైతులకు-పశువులకు ఉన్న అవినాభావసంబంధాన్ని మరింత బలపరిచేందుకు వారపు సంతలు మంచి వేదికగా ఉంటాయని ఆయన అన్నారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ తెలంగాణలో మాదిరిగా మన రాష్ట్రంలో ఏఎంసీలు అంతగా సద్వినియోగం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు మజ్జి శ్యామ్‌సుందర్, బి.రవికిరణ్, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్‌చైర్మన్లు గొలగాని రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, తెంటు పార్వతి, డైరెక్టర్లు, కార్యదర్శి శ్రీనివాసరావు, తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో యువతది కీలకపాత్ర

● నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్

పార్వతీపురం రూరల్: ప్రజాస్వామ్యం వ్యవస్థలో యువతది కీలకపాత్ర అని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. బుధవారంఎంఆర్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో యూత్ పార్లమెంట్‌ను నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ సమాజసేవకు యువత ముందుకురావాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ యువత ఉన్నత ఆశయాల దిశగా అడుగులు వేయాలన్నారు. సర్పంచ్ త్రినాథరావు మాట్లాడుతూ సంకల్ప బలం ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. అనంతరం విద్యార్థులతో యూత్ పార్లమెంట్ నిర్వహించి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డీపీఆర్వో లోచర్ల రమేష్, పాలిటెక్నిక్ కళా శాల ప్రిన్సిపాల్ ఎ.విలియంక్వారీ, ఈసీఈవిభాగాధిపతి జి.ఉదయ్‌భాస్కర్, అధ్యా పకులు పి.అనూరాధ, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షులు పి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.విలియం క్వారీ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఎంఆర్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, రాష్ట్ర సాంకేతిక విద్యశిక్షణా మండలి రూపొందించిన పాలిటెక్నిక్ చదవడం ఉత్తమం.. ఎందుకంటే పోస్టర్‌ను జిల్లా సమాచార సంబంధాలశాఖాధికారి లోచర్లరమేష్ ఆవిష్కరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులకు ఎంపికైబాలికలకు ఏఐసీటీఈ నుంచి ప్రగతిఉపకార వేతనాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లపాటు ఉపకార వేతనాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజనఅధికారి వెంకట్‌ఉజ్వల్, ఈసీఈ విభాగాధిపతి ఉదయ్‌భాస్కర్, అధ్యాపకులు పి.అనూరాధ, మండల ఉపాధ్య క్షుడు బి.రవికుమార్, సర్పంచ్ త్రినాథరావు, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షుడు పి.శ్రీనివాస పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

పాలకొండ:అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవించే సమయంలో ఉపయోగించే పరికరాలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. ప్రమాదాలు జరిగితే 08941-260111 లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 101 ద్వారా సమాచారం అందించాలని కోరారు. అనంతరం అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావుకు కళాశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మానుకొండ శ్యాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు పాల్గొన్నారు.

ఎం.సింగుపురం పాఠశాల వార్షికోత్సవం

పాలకొండ: మండలంలోని ఎం.సింగుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుగు సంగంనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గత శక్తులు వెలికితీసి ప్రగతికి తోడ్పడడం ఉపాధ్యాయులు కర్తవ్యమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్య క్రమాలు, పలు సినీగేయాలకు నృత్యాలు చేశారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, హైమావతి, వరప్రసాద్, కృష్ణమూర్తినాయుడు, జ్యోతి, పీడీ రాములు పాల్గొన్నారు.

పోలమాంబ జాతర ఆదాయం రూ.4.18 లక్షలు

సాలూరు:మక్కువ మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి ఏడో వారం జాతీయ ఆదాయం రూ. 4,18,906 వచ్చినట్లు ఈవో వీవీసూర్యనారాయణ బుధవారం తెలిపారు. శీఘ్రదర్శనం ద్వారా రూ.63,220, కేశఖండన ద్వారా రూ.4 వేల 80, విరాళాల ద్వారా లక్షా8 వేల 741 రూపాయలు, లడ్డు ప్రసాదం ద్వారా రూ.62,415 , పులిహోరా ప్రసాదం ద్వారా 38 వేల 50 రూపాయలు వచ్చినట్లు చెప్పారు.

సెప్టిక్ ట్యాంకర్, వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

బెలగాం/సీతానగరం: సీతానగరం మండలంలోని మరిపివలస వద్ద బుధ వారం సెప్టిక్‌ట్యాంక్, వ్యాన్ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మరిపివలస వద్ద సెప్టిక్ ట్యాంక్ పార్కింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో లగేజీతోవ్యాన్ విశాఖపట్నం నుంచి పార్వతీపురం వస్తున్న వ్యాన్ వెనుక నుంచి వచ్చిఢీకొట్టింది. దీంతో వ్యాన్ బోల్తాపడడంతో డ్రైవర్‌కు గాయా లయ్యాయి. దీంతో అయన్ను 108లో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



బోల్తా పడిన వ్యాన్

ఘనంగా ఉమాలింగేశ్వరస్వామి యాత్ర

భామిని:భామినిలో ఉమాలింగేశ్వరస్వామి ఆలయ ఆరోవార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా మూడురోజుల పాటు యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక పూజలు చేపడుతున్నామన్నారు. గురువారం వంశధార నదిలో ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేసేందుకు భక్తులు తరలిరావాలని కోరారు.

దాడులుచేస్తే కేసులు నమోదుచేయాలి

● ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు



మాట్లాడుతున్న జేసీ నాయుడు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: వైద్యులు, సిబ్బందిపై దాడులు చేసే వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదుచేయాలని ఐఎంఏరాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీనాయుడు డిమాండ్‌చేశారు. ఉపాధ్యాయులవలే వైద్యులకు ప్రత్యే ఎమ్మెల్సీ ఉండాలనికోరారు. దేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో సుమారు నాలుగులక్షల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు.బుధవారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడారు. వైద్యులకు, రోగులకు మంచి సంబంధంఉండాలన్నారు. వైద్యులకు ప్రస్తుతం నర్సింగ్‌హోమ్ ఏర్పాటుచేయా లంటే ఎన్నో ఇబ్బందులు ఎదురవుతు న్నాయన్నారు. ప్రభుత్వాలు ప్రతి వ్యవస్థను తమ చేతుల్లో ఉంచుకోవాలని ఆలోచనతో ఉండడంతో డాక్టర్లు వ్యవస్థను కూడా వారి కంట్రోల్‌లో ఉంచుకోవాలనే ఆలోచన వల్ల నర్సింగ్ హోం ఏర్పాటు చేసే వైద్యులకు ప్రభుత్వ నిబంధనలు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు యాళ్ల వివేక్, వై.పద్మజ, భోగి ఈశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణకు చర్యలు

● పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన



గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యటిస్తున్న ప్రసూన

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో అడవుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖాధికారి ఎం.ప్రసూన తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌కేపాడు, జేకేపాడు ప్రాంతాల్లో ఉన్న టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అడవుల్లో పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవుల్లో విలువైన వృక్షజాతి మొక్కలు ఉన్నాయన్నారు. ఎవరైనా అక్రమంగా మొక్కలు, చెట్లు నరికినా, మంటలు పెట్టినా, మద్యం సేవించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్య క్రమంలో కురుపాం రేంజర్ ఫారెస్ట్ సిబ్బంది తిరుమల, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపించాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం



సాలూరు రూరల్: బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న సంధ్యారాణి



కురుపాం రూరల్: కొండబారిడిలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న జగదీశ్వరి



పార్వతీపురంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న బోనెల విజయచంద్ర

రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఇంటికి పంపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఉమ్మడి జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలోచేరారు.

కూలీల బతుకులపై ధరల భారం: సంధ్యారాణి

సాలూరు రూరల్: నిత్యావసర సరుకులు, బస్సు, విద్యుత్ చార్జీలు వైసీపీ ప్రభుత్వం పెంచి కూలీ బతుకులపై భారం మోపిందని సాలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. సీతందొరవలస, భరిణికవలస, పెద్దవలస, మూలవలస తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరి గోరుముద్దలు ఎత్తి వేశారని, వ్యవసాయ పనిముట్లు, వడ్డీలేని రుణాలు తదితర వాటికి చరమగీతం పాడారన్నారు.నియోజకవర్గంలో 18 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రిగా రాజన్నదొర ఉన్నా మారుమూల గిరిజన గ్రామాలను అయన పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు, ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి, అక్యాన వెంకట తిరుపతిరావు, శ్యాం పాల్గొన్నారు.

13వ వార్డులో టీడీపీలో చేరిక

పార్వతీపురం ఆంధ్రజ్యోతి:పార్వతీపురంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర ప్రచారం నిర్వహించారు. మునిసిపాలిటీలోని 13వవార్డులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి ఆహ్వానించారు. 16వ వార్డుతో పాటు వివిధ వార్డుల్లో విజయచంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల గూర్చి వివరించారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: విజయచంద్ర

పార్వతీపురంటౌన్: ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బోనెల విజయచంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలక్రీడా మైదానంలో వాకర్స్‌ను కలిశారు. తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

సీతానగరం: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బోనెల విజయ చంద్ర తెలిపారు. రంగంపేటలో బాబు షూరిటీ భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీలో 50 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్‌నాయుడు, గొట్టాపు వెంకట నాయుడు, మాజీ సర్పంచ్ బొంగు భాస్కరరావు, పోల సత్యనారాయణ, పైల నాగభూషణరావు, బి.వెంకటరమణ, బి.చిరంజీవి, మర్రాపు శంకరరావు, రెడ్డి సింహాలరావు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీయే: జగదీశ్వరి

కురుపాం రూరల్:రానున్నది టీడీపీయేనని కురుపాం నియోజకవర్గ టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. కొండబారిడిలో శంఖారావం, సూపర్‌సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు కలిశెట్టి కొండయ్య, రంజిత్‌కుమార్ నాయికో, వెంపటాపు భారతి, సుబ్బలక్ష్మి, సుక్కు, గుజ్జువాయి, మరిపల్లి, ఉదయపురం పంచాయతీల గృహసారథులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దత్తిరాజేరు: మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

బీసీ డిక్లరేషన్ అమలు చేస్తాం

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ వంద శాతం అమలు చేస్తామని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. కొమ్ములక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడారు. ఆదరణ పథకం అమలు,బీసీలకు రుణాలు, ఇతర వస్తువులు కల్పనకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. చంద్రబాబు బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. సమావేశంలో పాడి సుధ, పోలూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీకి ముగింపు పలకడం ఖాయం: శ్రీనివాస్

దత్తిరాజేరు: టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమ న్వయంతో పనిచేస్తే సునాయాసంగా విజయం సాధించ వచ్చని గజపతినగరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కోమటిపల్లిలో నిర్వహించిన మండల నాయకులు సమావేశం మాట్లాడారు. వైసీపీ అరాచకాలకు ప్రజలు ముగింపు పలకడం కాయమని, పార్టీకి బుద్ధి చెప్ప దానికి ఎప్పుడు ఎన్నికలు వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. తోటపల్లి కాలువ పనులు ప్రారంభించి 17 ఏళ్లు గడిచినా ఇంతవరకు తట్ట మట్టి కూడా పోయలేదని ఆరోపించారు. దత్తిరాజేరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ టీడీపీ హయాంలో తీసుకొచ్చినా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అట్టహాసంగా ప్రారంభించినా విద్యార్థులకు చదువులు అందడం లేదన్నారు.నియోజకవర్గంలో ఎటువంటికంపెనీలు, యువ తకు ఉపాధిలేవన్నారు. నియోజకవర్గ జనసేన నాయకులు మర్రాపు సురేష్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాస్ గెలుపునకు అహర్నిశలు పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి కొండలరావు, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, బెజవాడ రాజేశ్వరి, బీసీ జిల్లా సాధికారిత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, కస్టర్ ఇన్‌చార్జిలు బెజవాడ బంగారునాయుడు, మజ్జి మహేష్, సీనియర్ నాయకులు చెల్లూరి సత్యారావు, గునిడి జగన్నాథం పాల్గొన్నారు.

సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

● గరుగుబిల్లి ఎంపీడీవో సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

గరుగుబిల్లి:వెలుగు గ్రామైక్య సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ కోరారు. బుధవారం గరుగుబిల్లిలోని కార్యాలయంలో మండల సమాఖ్య, గ్రామైక్యసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా మహిళా సంఘాలకు అందాల్సిన పథకాలను సక్రమంగా అందించాలన్నారు. పొదుపుతోపాటు బ్యాంకులనుంచి తీసుకున్న రుణాలు సక్రమ పద్ధతుల్లో చెల్లించేలా దృష్టి సారించాలన్నారు.మహిళలు ఆర్థికంగా బలోపేతానికి మంజూరు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు, ప్రసాద్, మండల సమాఖ్య ప్రతినిధులు గంట లక్ష్మి పాల్గొన్నారు.

'ఉపాధి' నిబంధనలు పాటించాలి: ఏపీవో



గొట్టివలసలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధి సిబ్బంది

గరుగుబిల్లి :గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిబంధనలు విధిగా పాటిం చాలని మండల ఉపాధి హామీ పథకం ఏపీవో ఎం.గౌరీనాథ్, ఇంజనీర్ డి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని గొట్టివలసలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో మేట్లను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలన్నారు. పలు పంచాయతీల్లో మేట్లు ఎంపిక జరగలేదన్నారు. రెండు పూటలా వేతనదారులు పనుల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. పనికి హాజరైన వారికే హాజరు వేయాలన్నారు. పనులు ప్రాంతాల్లో గుంపులుగా ఉంచకూడదన్నారు. సగటు వేతనం పొందేలా పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు నల్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం: పీవో

సీతంపేట:సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ పీవో కల్పనా కుమారి తెలిపారు.ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటున్న వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు బుధవారం పీవో కల్పనాకుమారి ఐటీడీఏ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగాకోచింగ్‌లో తీసుకోవాల్సిన మెళకువలను విద్యార్థులకు పీవో వివరించారు.

క్రాష్ ప్రోగ్రాం వ్యాన్ ప్రారంభం

సీతానగరం: సీతానగరంలో బుధవారం ఎంపీపీ రమణమ్మ, శ్రీరాముల నాయుడు ఆధ్వర్యంలో క్రాష్‌ప్రోగ్రాం వ్యాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరరావు, జడ్పీటీసీబాబ్జీ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్ కుమార్, పరిపాలనా. దికారి ఎంఎల్‌ఎన్ ప్రసాద్ సత్యనారాయణ, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మండల పరిషత్ సిబ్బందికి నోటీసులు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో తప్పు ఒకరు చేస్తే, శిక్ష సిబ్బందికి పడింది. మండలానికి సంబంధించి గతంలో ఎంపీడీవోగా జి.పైడితల్లి విధులు నిర్వహించారు.అయితే ఈమె ఎన్నికల నిబంధనలు కారణంగా సంతకవిటి మండలానికి బదిలీఅయ్యారు. ఈమె విధులు నిర్వహించిన సమయంలో మండల పరిషత్‌కు సంబంధించిన రికార్డులను ఈ నెల 2న విజయనగరం జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్ పరిశీలించారు. అయితే, రికార్డులు అందుబాటులో లేకపోవడంతో పాటు జాబ్ చార్టు మేరకు విధులు నిర్వహించడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గతంలో నిర్వహించిన ఆడిట్‌లో పలు అవకతవకలు బయటపడ్డాయి. దీంతో సిబ్బందికి షోకాజ్ నోటీసులను బుధవారం జారీ చేశారు. ఈ మేరకు మూడు రోజుల్లో రాత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే 2022-23 సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయిలో రికార్డులను 15 రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు.

బదిలీ అయిన ఎంపీడీవో ప్రత్యక్షం

గరుగుబిల్లి మండలం నుంచి వేరే మండలానికి బదిలీ అయిన ఎంపీడీవో జి.పైడితల్లి బుధవారం కార్యాలయంలో సాయంత్రం ప్రత్యక్షమయ్యారు. ఈమె బదిలీ జరిగి 35 రోజులు తదుపరి కొంతమేర రికార్డులు, బిల్లులు తయారు చేసికొచ్చినట్లు కనిపించింది. రికార్డులను గుట్టుచప్పుడుగా కార్యాలయంలో సిబ్బందితో తయారు చేస్తున్నారు. ఈమె ఎంపీడీవోగా విధులు నిర్వహించిన సమయంలోపలు అవకతవకలు నెలకున్నాయని నాగూరు మండల ప్రాదేశిక సభ్యులు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ జిల్లా పరిషత్ సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈమె కాలంలో నిర్వహించిన వాటిపై దర్యాప్తు నిర్వహించాలని కోరారు. రికార్డులు పరిశీలన చేస్తున్న సమయంలో విలేఖరులను చూసి ముఖం పక్కకు తిప్పేసుకున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న రమణ

కురుపాం: ఎన్నికలు సక్రమంగా ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో బీవీ రమణ కోరారు. బుధవారం కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గల సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎటువంటి పక్షపాతం లేకుండా సక్రంగా నిర్వహించాడానికి తమ బాధ్యతలు నిర్వహించారలని కోరారు.

బత్తిలిలో పోలీసుల కవాతు

భామిని: బత్తిలిలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. బత్తిలి బస్టాండ్ నుంచి పురవీధుల్లో పోలీసులు పరేడ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎటువంటి సంఘటనల జరగకుండా ఉండేందుకు కవాతు చేసినట్టు బత్తిలి ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.



రోడ్ల పనులకు శంకుస్థాపన

సాలూరు:మక్కువ మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ అడారు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మడవలస వరకు తారురోడ్డుపనులు, మార్కొండపుట్టి పంచాయతీ మర్రి వానివలసలో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర బుధవారంశంకుస్థాపనచేశారు.కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాసరావు, మావుడి రంగునాయుడు, ఎంపీపీ మర్రి పారమ్మ, సర్పంచ్ సీదరపు లక్ష్మి పాలొన్నారు.

గంజాయి స్వాధీనం

కొమరాడ: కూనేరు చెక్ పోస్టు వద్ద మంగళవారం రాత్రి రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న ఓ ప్రైవేటు బస్సులో ఇద్దరు మైనర్ల నుంచి సుమారు మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. వీరిద్దరూ విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారని పేర్కొన్నారు.ఒడిశాలోని టికిరి ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలుచేసి తీసుకువస్తున్నట్లు వారు తెలియజేసినట్లు చెప్పారు.

ఇన్‌పుట్ సబ్సిడీ జమ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీని బుధవారం జమ చేశారు. గత ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావం, డిసెంబరులో మిచాంగ్ తుఫాన్‌కు జిల్లాలో పంట నష్టపోయిన 259 మంది రైతులకు రూ.14.75 లక్షల పరిహారం చెక్కును ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్ అందించారు.ఈ మేరకు సీఎం జగన్మోహన్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయం నుంచి ఖరీఫ్-2023 వర్షాభావం, మిచాంగ్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేశారు. కార్య క్రమంలో కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్, రైతులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి గ్రామంలో నాగావళి నదీతీరంలోగల ఉన్న శివాలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని గురు, శు క్రవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మహాశివరా త్రి రోజున ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్య క్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వ్యవసాయ ఆధారిత పనులతో ఆదాయం

● వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీతారాం



రైతులకు పరికరాలు పంపిణీచేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సాలూరు రూరల్: గిరిజన రైతులు వ్యవసాయంతో పాటు వ్యవసాయ ఆధారిత పనులతో అధిక ఆదాయం సంపాదించడానికి శ్రద్ధ చూపాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీతారాం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రేగాపువలస, గంగన్నదొరవలస, మెట్టవలస గిరిజనగ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టంలో భాగంగా ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ ఆధారిత పనులకు సంబంధించి రూ. రెండు లక్షల విలువైన పరికరాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా సీతారాం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయసాగుతో పర్యావరణానికి, రైతులకు మేలు జరుగు తుందని, ఈ పంటలకు అధిక ధర లభిస్తుందని తెలిపారు. శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ పంటల సాగుపై వివిధ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్జీరంగ విశ్వవిద్యాలయ ఐఎఫ్ఎస్ ఏఈవో ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.